# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ఈరోజు బాధ్యతలు చేపట్టారు.
- ❖ కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారులు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని 2027 మార్చి వరకూ పొడిగిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- ❖ మూడు రోజుల భారత్ పర్యటన నిమిత్తం భూటాన్ ప్రధానమంత్రి షెరింగ్ టోబ్గే ఈ రోజు మధ్యాహ్నం న్యూఢిల్లీ చేరుకున్నారు.
- ❖ ఈశాన్య ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి వుందని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 119వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

=========================

ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీ.కే. సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నాయకులు హాజరయ్యారు. రేఖా గుప్తాతో పాటు ఎన్నికల్లో విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ శాసనసభ్యులు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇది ఉండగా ఈరోజు సాయంత్రం ఢిల్లీ సెక్రటేరియట్ లో రేఖా గుప్తా ఢిల్లీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. వికసిత్ ఢిల్లీ కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా రేఖా గుప్తా పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 25 సెకన్లు)

=========================

కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారులు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని మరో రెండు సంవత్సరాలు పొడిగిస్తూ.. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 2027 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. కాగా వి. అనంత నాగేశ్వరన్ 2022 జనవరిలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా బాధ్యతలు చేపట్టారు.

=========================

మూడు రోజుల భారత్ పర్యటన నిమిత్తం భూటాన్ ప్రధానమంత్రి షెరింగ్ టోబ్గే ఈ రోజు మధ్యాహ్నం న్యూఢిల్లీ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో టోబ్గే సమావేశం కానున్నారు. అలాగే రేపు జరగనున్న సోల్ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొంటారు. భారతదేశం భూటాన్ మధ్య శాశ్వత సంబంధాలను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని భారత్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

=========================

ఈశాన్య ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి వుందని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. న్యూ ఢిల్లీలో అస్సాం రైఫిల్స్ నిర్వహించిన యూనిటీ ఉత్సవ్ "వన్ వాయిస్, వన్ నేషన్" కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... 2014 నుంచి దాదాపు 10,500 మంది ఈశాన్య ప్రాంతానికి చెందిన యువకులు ఆయుధాలతో లొంగిపోయి ప్రధాన స్రవంతిలో చేరారని వెల్లడించారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి నుండి క్రీడలు, విద్య, వ్యవసాయంతో పాటు ప్రతి రంగంలో ఈశాన్య యువతకు అనేక అవకాశాలు కల్పించామని హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ...

(వాయిస్ 29 సెకన్లు)

=========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

=========================

భారత తీర రక్షక దళం కోసం 149 అధునాతన రేడియోలను కొనుగోలు చేసేందుకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (BEL)తో రక్షణ మంత్రిత్వ శాఖ 1,220 కోట్ల రూపాయల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అత్యాధునిక రేడియోలు సురక్షితమైన సమాచార భాగస్వామ్యం, సహకారం, పరిస్థితులపై అవగాహన కల్పిస్తాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది సముద్ర భద్రత చట్టం అమలు, రక్షణతో సహా ప్రధాన బాధ్యతలను నెరవేర్చడానికి ఇండియన్ కోస్ట్ గార్డ్ యొక్క సామర్థ్యాన్ని బలపరుస్తుందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా అధునాతన మిలిటరీ-గ్రేడ్ కమ్యూనికేషన్ సిస్టమ్‌ల కోసం దేశం యొక్క తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం.

విరామం

=========================

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ రెండు రోజుల దక్షిణాఫ్రికా పర్యటన నిమిత్తం ఈరోజు జోహన్నెస్‌బర్గ్ కు చేరుకున్నారు. ఇక్కడ జరిగే జీ-20 విదేశాంగ మంత్రుల సమావేశం లో పాల్గొనున్నారు.ఇదిలా ఉండగా ఈరోజు ఆయన సింగపూర్, బ్రెజిల్ విదేశాంగ మంత్రులతో సమావేశమయ్యారు.

==========================

ఆన్‌లైన్ కంటెంట్ పబ్లిషర్స్ (ఓటీటీ ప్లాట్ఫామ్స్) ఐటీ రూల్స్ 2021 చట్టాన్ని తప్పకుండా పాటించాలని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చట్టంలో పొందుపరిచిన నైతిక నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలని స్పష్టం చేసింది. ఓటీటీ ప్లాట్ఫామ్స్, సామాజిక మాధ్యమాలకు చెందిన కొందరు పబ్లిషర్లు ప్రచురించిన అశ్లీల కంటెంట్ వ్యాప్తిపై ప్రజా ఫిర్యాదులు అందుతున్న నేపధ్యంలో ఈ ప్రకటన విడుదలయ్యింది.

==========================

'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమం కింద ఈ రోజు రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... అరుణాచల్ ప్రదేశ్ ఉదయించే సూర్యుని భూమి అని మఠాలు, సరస్సులు సంస్కృతికి ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఇది ప్రపంచంలోని అత్యంత అద్భుతమైన బహుభాషా గిరిజన ప్రాంతాలలో ఒకటిగా గుర్తించబడిందని పేర్కొన్నారు. మిజోరాం 1986లో పూర్తి స్థాయి ఇండియన్ యూనియన్ రాష్ట్రంగా అవతరించి 1987 ఫిబ్రవరి 20న రాష్ట్ర హోదాను పొందిందని తెలిపారు. మిజోరాం ప్రజలు సంప్రదాయ విలువలను, ఆచారాలను కొనసాగించడంలో అత్యంత జాగ్రత్త తీసుకుంటారని గవర్నర్ పేర్కొంటూ....

(వాయిస్ 29 సెకన్లు)

==========================

ఉత్తరప్రదేశ్ ఆర్థిక మంత్రి సురేష్ కుమార్ ఖన్నా 2025-26 ఆర్థిక సంవత్సరానికి 8 లక్షల 8 వేల 736 కోట్ల రూపాయల బడ్జెట్‌ను ఈరోజు ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ వ్యయం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే బడ్జెట్ వ్యయం కంటే 9.8 శాతం ఎక్కువగా ఉందని మంత్రి తెలియజేశారు. బడ్జెట్‌లో ఐటీ, పరిశోధనలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. ప్రతిభావంతులైన విద్యార్థినుల కోసం ఉచితంగా స్కూటీ అందించే పథకాన్ని త్వరలో ప్రారంభిస్తామని సురేష్ కుమార్ ఖన్నా తెలియజేశారు.

==========================

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా దుబాయ్ వేదికగా భారత్ బంగ్లాదేశ్ క్రికెట్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తొలి టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకుని 228 పరుగులను పరుగులను భారత్‌కు నిర్దే శించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 28 ఓవర్ల పూర్తయ్యే సరిందిక 3 వికెట్ల నష్టపోయి 133 పరుగులు చేసింది.

==========================

ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహా కుంభమేళా ఆధ్యాత్మిక సమావేశం మాత్రమే కాకుండా పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించే దిశగా ఉద్యమం పరిణామం చెందిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. కుంభమేళాలోని నమామి గంగే పేరున నదిని పరిరక్షించడంతో పాటు శుభ్రపరచడంతో ప్రాముఖ్యతను

సంతరించుకుంది. నమామి గంగే కార్యక్రమం నది స్వచ్ఛత కోసం ఒక ప్రత్యేక వేదికగా మారిందని అధికార వర్గాలు తెలిపాయి.

==========================

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈరోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఆయన నిన్న బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రజలకు ఇచ్చిన సందేశంలో దేశ నిర్మాణానికి మొదటి అడుగు ఓటు వేయడం అని, 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి భారత పౌరుడు ఓటరుగా మారి ఎల్లప్పుడూ ఓటు వేయాలని జ్ఞానేష్ కుమార్ అన్నారు. మంగళవారం తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న రాజీవ్ కుమార్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

==========================

==========================